ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 21 ఏప్రిల్ 2025



ఘనంగా ఈస్టర్ వేడుకలు

ఈస్టర్ పండుగను ఆదివారం క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. రోమన్ సైనికుల చేతిలో చిత్రహింసలు అనుభవించి శుక్రవారం మరణించిన ఏసు క్రీస్తు.. మూడో రోజైన ఆదివారం పునరుత్థానుడై సమాధి నుంచి లేచిన సందర్భంగా క్రైస్తవులు ఈస్టర్ పండగను జరుపుకోవడం ఆనవాయితీ. చర్చిల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గతించిన పెద్దల సమాధుల వద్దకు వెళ్లి పూలతో అలకరించి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.



ఈస్టర్ పండుగ సందర్భంగా కోటవురట్లలో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తున్న క్రైస్తవులు

ఘనంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను ఆదివారం పార్టీ నాయకులు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచారు. చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్తదానం చేశారు. రోగులు, బాలింతలకు పండ్లు, రొట్టెలు, మజ్జిగ పంపిణీ చేశారు. పలుచోట్ల దివ్యాంగులకు పరికరాలు, పేదలకు వస్త్రాలు, నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీతోపాటు కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు కూడా పాల్గొన్నారు.రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి సమీపంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. 75 కేజీల భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం ఏర్పాటు చేసి, ఆమె స్వయంగా వడ్డించారు.



నక్కపల్లి సమీపంలోని తన నివాసంలో 75 కిలోల భారీ కేక్ కట్ చేస్తున్న హోం మంత్రి అనిత. చిత్రంలో కూటమి నాయకులు తోట నగేశ్, గెడ్డం బుజ్జి, ఏజెర్ల వినోద్‌రాజు, పెదిరెడ్ల చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు తదితరులు వున్నారు.

డీఎస్సీ..

ఉపాధ్యాయ నియామకాలకు అధిక పోటీ

ఉమ్మడి జిల్లాలో మొత్తం పోస్టులు 1,139
ఎస్జీటీలు 575, స్కూల్ అసిస్టెంట్‌లు 564

- ఎస్జీటీల్లో అత్యధికంగా 335 పోస్టులు ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమాల్లో..
- ఎంపీపీ/మునిసిపల్/ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు 239 మాత్రమే!
- అభ్యర్థులు 35 వేల మంది ఉండవచ్చని అంచనా
- పోస్టులు తగ్గడానికి గత ప్రభుత్వ నిర్వాకమే కారణమా?



విశాఖలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. సుమారు ఆరేళ్ల నుంచి డీఎస్సీ నియామకాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూన్‌లో నిర్వహించనున్న రాత పరీక్షలకు ఆదివారం నుంచే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 575, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 564 ఉన్నాయి. సెకండరీ గ్రేడ్ కేటగిరీలో 575 పోస్టులకు గాను గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీలు 335 వుండగా, ఎంపీపీ/మునిసిపల్/ప్రభుత్వ పాఠశాలల్లో 239 ఖాళీలు మాత్రమే వున్నాయి. ఉమ్మడి జిల్లాలో డీఈడీ, బీఈడీ/తత్సమాన కోర్సులు చదివి డీఎస్సీ కోసం సుమారు 35 వేలమంది అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. వీరిలో డీఈడీ కోర్సు చేసిన వారి కంటే బీఈడీ/తత్సమాన కోర్సులు చదివినవారే ఎక్కువగా ఉంటారని అంచనా వేస్తున్నారు.

పోస్టులు తగ్గడానికి..

పోస్టులు తగ్గిపోవడానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలో ఎంపీపీ/ప్రభుత్వ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 5,931 ఉండగా ప్రస్తుతం 5,233 మంది టీచర్లు పని చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో 5,143 పోస్టులకుగాను 4,823 మంది పనిచేస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవో నంబర్-117ను అమలు చేయడం ద్వారా ప్రాథమిక విద్యను చాలావరకు దెబ్బతీశారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను సమీపంలో ఉన్న పాఠశాలల్లో విలీనం చేయడం, ఇతరత్రా కారణాలతో అక్కడ చదివే పిల్లలపై ప్రభావం పడింది. గడిచిన మూడేళ్లలో ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. దీంతో ... మిగతా 6వ పేజీలో

వేసవిలో నీటి ఎద్దడి నివారణ

రూ.20 కోట్లతో వివిధ రకాల పనులు

- బోర్లు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ పనులకు రూ.6 కోట్లు
- 15వ ఆర్థిక సంఘం మొదటి విడత రూ.14 కోట్లు విడుదల
- రోడ్లు, డ్రైన్లు, బోర్ల మరమ్మతు వంటి 725 పనులకు కేటాయింపు
- ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు చర్యలు
- అన్ని జడ్పీ హైస్కూళ్లకు ప్రహరీ గోడలు
- 'ఆంధ్రజ్యోతి'తో జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి



మండల పరిషత్ నిధులతో దేవరాపల్లి మండలం కొత్తపల్లిలో బోరు తవ్వకం (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించామని, పనులు అమలుచేశామని జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (సీఈవో) పి.నారాయణమూర్తి పేర్కొన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ, సిబ్బంది జీతాలు, బోర్లు మరమ్మతులకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.ఆరు కోట్లు కేటాయించామన్నారు. సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేతిపంపుల (బోర్లు) మరమ్మతుకు 15వ ఆర్థిక సంఘం నిధులతో మండల పరిషత్‌లు విడిభాగాలు కొనుగోలు చేశాయని, చేతిపంపులు, నీటి పథకాల మరమ్మతులు పూర్తిచేశామని చెప్పారు. ఇంకా ప్రతి మండలంలో అత్యవసర పనుల కోసం విడిభాగాలు సిద్ధంగా ఉంచామన్నారు. నీటి పథకాలు, బోర్ల మరమ్మతులకు సంబంధించి ఆయా మండలాల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా అనేక గ్రామాలకు తాగునీరు అందుతున్నదని, ఇప్పటికే ఉన్న రక్షిత నీటి పథకాల నుంచి ఇంటింటికీ కొళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాని చెప్పారు.



జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి

ఆర్థిక సంఘం నిధులతో 725 పనులు

గత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలివిడత కింద 15వ ఆర్థిక సంఘం ద్వారా జడ్పీకి వచ్చిన రూ.14 కోట్లతో ఉమ్మడి జిల్లాలో రోడ్లు, డ్రైన్లు, బోర్ల మరమ్మతులు వంటి 725 పనులు మంజూరుచేయగా ఇంతవరకు 200కుపైగా పనులు పూర్తిచేసి రూ.ఆరు కోట్ల వరకు బిల్లులు చెల్లించామన్నారు. వాస్తవంగా ఈ పనులు మార్చి నెలాఖరులోగా పూర్తికావల్సి ఉందని, అయితే పలు కారణాల వల్ల కొంత జాప్యం జరిగిందని పేర్కొంటూ జూన్ నెలాఖరుకు పనులు పూర్తిచేయాలని అధికారులను ... మిగతా 6వ పేజీలో

తాచేరుపై వంతెన నిర్మాణం ఎప్పుడో?

16 నెలల క్రితం కూలిన పాత బ్రిడ్జి

- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నెల రోజుల తరువాత తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు నిర్మాణం
- గత ఏడాది వరద ధాటికి కొట్టుకుపోయిన రోడ్డు
- ప్రతిపాదనల్లోనే కొత్త వంతెన నిర్మాణం



తాచేరు గెడ్డ వద్ద కూలిన వంతెన స్థానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు



గత ఏడాది వర్షాకాలంలో కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై వంతెన కూలిపోయి పదహారు నెలలైనప్పటికీ కొత్త వంతెన నిర్మాణానికి అతీగతీ లేదు. తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ రోడ్డు వర్షాకాలంలో వరద నీటితో మునిగిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. విశాఖ, అనకాపల్లి, చోడవరం వైపు నుంచి మాడుగుల, పాడేరు వైపునకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

బుచ్చెయ్యపేట మండలంలో వడ్డాది నుంచి చోడవరం వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై బ్రిటీష్ హయాంలో వంతెన నిర్మించారు. వంతెన సామర్థ్యం 30 టన్నులు. కానీ 60-70 టన్నుల బరువైన గ్రానైట్ రాళ్లను రవాణా చేసే వాహనాలు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగించడంతో బలహీనంగా మారి శిథిలావస్థకు చేరింది. ఈ విషయం ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ అధిక లోడుతో వెళ్లే వాహనాలను నియంత్రించలేకపోయారు. అంతా అనుకున్నట్టే 2023 డిసెంబరు 20న వంతెన కూలిపోయింది. దీంతో వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించాల్సి వచ్చింది. సుమారు నెల రోజుల తరువాత నదికి అడ్డగా సిమెంట్ తూములు వేసి, వాటిపై గ్రావెల్ పోసి కాజ్‌వే నిర్మించారు. ఇది లోతట్టుగా ఉండడంతో నదిలో నీటి ప్రవాహం పెరిగితే రోడ్డు పైనుంచి ... మిగతా 6వ పేజీలో

నూకాంబిక ఆలయం కిటకిట

- అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు





నూకాంబిక అమ్మవారిఇ దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య జాతర ప్రారంభమైన తరువాత అమ్మవారి దర్శనానికి అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. అంతకుముందు ఉదయం ఆరు గంటలకు ఆలయ అర్చకులు బాలాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాధారణ భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. అప్పటికే భక్తులు క్యూలైన్లలో పెద్ద సంఖ్యలో వేచివున్నారు. ఆలయం లోపల, ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు నిండిపోయి రోడ్డుపైనా బారులు తీరారు. రాత్రి ఎనిమిది గంటలకు ఆలయం మూసివేసే వరకు భక్తులరాక కొనసాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదినం సందర్భంగా గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ ప్రత్యేకాధికారి శోభారాణి, ఈవో రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


-అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి

సేంద్రీయ సాగులో ముందడుగు

ఆధునిక పద్ధతులతో నాణ్యమైన అధిక దిగుబడులు

- మార్కెట్‌లో డిమాండ్‌తో మెరుగైన ధర
- ఖర్చులకు రెట్టింపు ఆదాయం
- పదేళ్ల నుంచి ప్రకృతి సేద్యం
- ఆదర్శంగా నిలుస్తున్న అమృతపురం రైతు గండి ముత్యాలనాయుడు





మల్చింగ్ షీట్స్ వేసి అంటు పద్ధతిలో సాగు చేస్తున్న వంగ. (ఇన్‌సెట్‌లో) గ్రాఫ్టింగ్ చేసిన వంగ మొక్క



ట్రెల్లీ విధానంలో టమాటా పండిస్తున్న రైతు ముత్యాలనాయుడు

సబ్బవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని అమృతపురం గ్రామం ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. ఈ పంటల సాగులో రైతులు ఎప్పటికప్పుడు ఆధునిక పద్ధతులు అవలంబిస్తుంటారు. విశాఖ నగరానికి చేరువగా ఉండడంతో కూరగాయలకు గిరాకీ వుంది. దీంతో ఎక్కువ మంది రైతులు ఏడాది పొడవునా వివిధ రకాల కూరగాయ పంటలను పండిస్తున్నారు. ఉద్యాన పంటలను సాగు చేసే రైతుల్లో గండి ముత్యాలనాయుడు మిగిలిన ... మిగతా 6వ పేజీలో

రెండు ఎకరాల్లో వరికి రూ.1.6 లక్షల మిగులు



రెండు ఎకరాల్లో వరి ఎకరాలు వేసాను. పెట్టుబడి, ఇతర ఖర్చులు కలిసి లక్షా 20 వేల రూపాయల వరకు అయ్యాయి. 55 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ధాన్యం మరపట్టించి 25 కిలోల చొప్పున బియ్యం ప్యాకింగ్ చేస్తే 115 బ్యాగులు వచ్చాయి. తవుడు, నూక, చిట్టు వంటివి మిల్లింగ్ ఖర్చులకు సరిపోయాయి. సేంద్రీయ పంట కావడంతో ఒక్కో బస్తా రూ.2,500 ధర పలికింది. సుమారు రూ.2.8 లక్షల ఆదాయం వచ్చింది. ఖర్చులుపోను రూ.1.6 లక్షలు మిగిలాయి.

గండి ముత్యాలనాయుడు, సేంద్రీయ సాగు రైతు

ఘనంగా ఈస్టర్ వేడుక

» చర్చిల్లో ప్రార్థనలు » క్రీస్తు బోధనలను వినిపించిన పాస్టర్లు

రాంబిల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఈస్టర్‌ను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో, సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అప్పన్నపాలెం, గొరపూడి, వెల్చూరు, పంచదార్ల, వాడనర్సాపురం, కొత్తపట్నం, చినకలవలాపల్లి, సంతపాలెం, ధారభోగాపురం, వెంకటాపురం, కొత్తూరు, నారాయణపురం, లాలంకోడూరు, దిమిలి తదితర గ్రామాల్లోని చర్చిలో పాస్టర్లు ఏసు క్రీస్తు శాంతి సందేశాలను వినిపించారు. ప్రభువు చూపిన మార్గంలో అంతా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా చర్చిల పాస్టర్లు ఎం.సుధీర్, జాషువారాయ్, వి.కాలేబు, జేమ్స్, సైమన్‌పీటర్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అచ్యుతాపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందినట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. జంగులూరుకు చెందిన లాలం శ్రీను (39) ఈనెల 17న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడన్నారు. వెంటనే అతనిని విశాఖ కేజీహెచ్‌లో చేర్పించి చికిత్సలు అందిస్తుండగా, ఆదివారం మృతి చెందినట్టు చెప్పారు. ఇతని భార్య గతంలో చనిపోయిందన్నారు. తొమ్మిదేళ్ల బాలుడు ఉన్నాడన్నారు. మృతుడి తల్లి దేముడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


అగ్నిమాపక పరికరాల ప్రదర్శన దృశ్యం

ఎలమంచిలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆ శాఖ కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి రాంబాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అగ్నిమాపక పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు.

విజనరీ నేత చంద్రబాబు

» జన్మదిన వేడుకల్లో వక్తల ప్రశంసల జల్లు » అచ్యుతాపురంలో మిన్నంటిన సంబరాలు


ఎలమంచిలి టీడీపీ కార్యాలయంలో...



అచ్యుతాపురంలో కేక్ కట్ చేస్తున్న ప్రగడ, ఎమ్మెల్యేలు సుందరపు, బండారు, మాజీ ఎమ్మెల్సీ చలపతిరావు

అచ్యుతాపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అచ్యుతాపురంలోని మండల కాంప్లెక్స్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు నాలుగు మండలాల నుంచి కూటమి శ్రేణులు భారీగా తరలి వచ్చారు. ముందుగా కోలాటం పోటీలు నిర్వహించగా, ఉమ్మడి విశాఖ జిల్లానుంచి పది జట్లు హాజరయ్యాయి. అనంతరం చంద్రబాబు జన్మదిన కేక్‌ను నాయకులు కట్‌చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ నవ్యాంధ్ర సృష్టికర్త, అలుపెరుగని పోరాట యోధుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. కోలాటం విజేతలకు బహుమతులతో పాటు పేదలకు చీరలు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, జడ్పీ మాజీ చైరపర్సన్ లాలం భవాని, నాయకులు బి.జగన్నాథం, బుద్ద నాగజగదీశ్వరరావు, ధూళి రంగనాయకులు, రాజాన సన్యాసి నాయుడు, జనపరెడ్డి నర్సింగరావు, బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, పీలా తులసీరామ్, రాజాన నానాజీ, నీరుకొండ నర్సింగరావు, డి.నాగభూషణంతో పాటు నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎలమంచిలిలో...

ఎలమంచిలి : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు విజనరీ కలిగిన గొప్ప నాయకుడుగా పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఇత్తంశెట్టి రాజు, గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, నాయకులు కొలుకులూరి విజయ్‌బాబు, కొఠారు సాంబ, బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవి, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని మునిసిపాలిటీలోని అగ్రహారంలో కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొక్కిరాపల్లిలో గ్రామ జ్యోతి చిన్నారులు వీధిలో మొక్కలు నాటారు. నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో..

రాంబిల్లి : నవ్యాంధ్ర నిర్మాత, సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పంచదార్ల గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు వి.దినబాబు ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు జన్మదిన కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పార్టీ నాయకులు చోడిపల్లి సత్యనారాయణ, అందుకూరి ప్రసాద్, సూరాడ అప్పలరాజు,ఉమ్మిడి నాగేష్, రేఖ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే, హరిపురంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను జరిపారు. పార్టీశ్రేణులతో కలిసి ఆయన కేక్ కట్‌చేసి పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధూళి రమణ, నాయకులు ధూళి అప్పారావు, డి.అప్పారావు, కోన అప్పలనాయుడు, జోగా పైడిరాజు పాల్గొన్నారు. అలాగే, గ్రామ గ్రామాన ఈ వేడులకు టీడీపీ శ్రేణులు జరిపారు.


రాంబిల్లి మండలం హరిపురంలో చీరలు పంపిణీ చేస్తున్న ధూళి రంగనాయకులు


మునగపాక జడ్పీ స్కూల్‌లో మొక్కనాటుతున్న టీడీపీ నాయకులు

మునగపాక మండలంలో...

మునగపాక : ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను మండలంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మునగపాకలో సీనియర్ నాయకులంతా అయ్యప్పస్వామి ఆలయంలో చంద్రబాబుకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని పూజలు చేశారు. పలుచోట్ల కేక్‌లను కట్‌చేసి పంచిపెట్టారు. పలువురు నాయకులు సామాజిక సేవా కార్యక్రమాలు జరిపారు. గవర్ల అనకాపల్లి, తిమ్మరాజుపేట, మంగళవరపుపేట, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఈ వేడుకలను మరింత ఘనంగా నిర్వహించారు.

తాచేరుపై వంతెన నిర్మాణం ఎప్పుడో?

... 5వ పేజీ తరువాయి

నీరు పారుతున్నది. గత ఏడాది వర్షాకాలంలో వరద ధాటికి గ్రావెల్‌తోపాటు తూములు కూడా కొట్టుకుపోయాయి. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. అధికారులు కొత్తగా తూములు వేసి, గ్రావెల్‌తో డైవర్షన్ రోడ్డును పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది జూన్ 17న ఎంపీ సీఎం రమేశ్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఇక్కడకు వచ్చి పరిశీలించారు. కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కాగా వడ్డాది నుంచి చోడవరం మండలం వెంకన్నపాలెం జంక్షన్ వరకు కొత్త కల్వర్టులు నిర్మించాల్సి వుందని, వీటితోపాటు తాచేరు నదిపై కొత్తవంతెన నిర్మాణానికి రూ.5 కోట్లతో ప్రతిపాదలు తయారు చేసి పంపామని ఆర్అండ్‌బీ చోడవరం ఏఈ సత్యప్రసాద్ తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.

నాలుగున ఉమ్మడి రాష్ట్రస్థాయి పాటల పోటీలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఎలమంచిలి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని ఇక్కడ వచ్చే నెల నాలుగోతేదీన ఉమ్మడి రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం కమిటీ చైర్మన్ మత్తుర్తి రామారావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో ఈ పోటీలు స్త్రీ, పురుషుల విభాగాల్లో జరగనున్నాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన ఔత్సాహికులు కమిటీ ప్రతినిధులను సంప్రదించాల్సిందిగా వారు కోరారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణ

... 5వ పేజీ తరువాయి

ఆదేశించామన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు ఇంకా విడుదల కావల్సి ఉందన్నారు.

కాగా ఆర్థిక సంఘం నిధుల్లో ఇప్పటివరకు పంచాయతీలకు 70 శాతం, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 15 శాతం చొప్పున వచ్చేవని, అయితే తాజాగా చేసిన మార్పుల చేసిన మేరకు మండల పరిషత్‌లకు 20 శాతం, జడ్పీలకు 10 శాతం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రహదారులు, ఇతర పనులకు రూ.20 కోట్లు, తాగునీటి పథకాలకు రూ.10 కోట్ల వ్యయానికి పాలనాపరమైన ఆమోదం తెలిపినట్టు సీఈవో పేర్కొన్నారు. సాధారణ నిధులు రూ.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వీటికి సంబంధించి ఇంత వరకు రూ.ఏడు కోట్ల విలువైన బిల్లులు సీఎంఎఫ్ఎస్‌కు అప్‌లోడ్ చేశామన్నారు.

అన్ని జడ్పీ హైస్కూళ్లకు ప్రహరీ గోడలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ సీఈవో నారాయణ మూర్తి తెలిపారు. ప్రతి పాఠశాల చుట్టూ ప్రహరీగోడ వుండాలనే నిబంధన అమలుచేశామన్నారు. ఇప్పటి వరకు ప్రహరీగోడలు లేని పాఠశాలలకు సమగ్ర శిక్ష, ఉపాధిహామీ పథకం నిధులతో గోడలు నిర్మిస్తామని చెప్పారు. ప్రతి ఉన్నత పాఠశాల ఆస్తులకు సంబంధించి ఆయా మండల తహసీల్దార్ల నుంచి ఫెయిర్ అడంగల్ కాపీలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ పాఠశాలల ఆస్తుల విషయంలో ఆయా మండల పరిషత్ అధికారులకు ఇప్పటికే సూచనలు చేశామని సీఈవో వెల్లడించారు.


ఉపమాక ఆలయంలో పూజలు చేస్తున్న హోంమంత్రి అనిత


పాయకరావుపేటలో చం ద్రబాబు కేక్ కట్ చేస్తున్న నాయకులు


కోటవురట్ల: బీకేపల్లిలో కేక్ కట్ చేస్తున్న నేత లాలంకాశీనాయుడు

చంద్రబాబు పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

» హోం మంత్రి అనిత

» ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

నక్కపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమం త్రి చ్రందబాబు పాలనలో రా ష్ట్రం సర్వముఖాభివృద్ధి చెందుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు.స్థానిక క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం చంద్రబాబునాయుడు బర్త్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా మె 75 కేజీల కేక్ కట్ చేసి, సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు అన్నదానం చేశారు. హోం మంత్రి అనిత స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో నిబద్ధత, దేశం గర్వించదగ్గ పరిపాలనాదక్షుడైన చంద్రబాబు వద్ద తాను పనిచేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. భావితరాల కోసం అలుపెరగని పోరాట యోధుడు చంద్రబాబు అన్నారు. ఆయన విజన్ వున్న నేత అన్నారు. 2027 నాటికి ఏపీ అగ్రగామిగా నిలిపేందుకు చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తోట నగేశ్, గెడ్డం బుజ్జి, ఎస్.రాయవరం మాజీ ఎంపీపీ ఏజెర్ల వినోద్‌రాజు, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, కాశీనాయుడు, నల్లపరాజు వెంకట్రాజు, దేవర సత్యనారాయణ, కోన అప్పలరాజు పాల్గొన్నారు.

ఉపమాక ఆలయంలో పూజలు

ఉపమాక వేంకటేశ్వరస్వామిని హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఆలయంలో ఆయన పేరుతో హోం మంత్రి పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు హోం మంత్రి అనితకు వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలందించారు. ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు,కురందాసు నూకరాజు, కొండబాబు, వెలగా శ్రీను,అల్లు నర్సింహమూర్తి, సర్పంచ్ వీరబాబు పాల్గొన్నారు.

పాయకరావుపేట: చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలు పురస్కరించుకుని స్థానిక పాండురంగస్వామి ఆలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథం, యాళ్ల వరహాలబాబు, చింతకాయల రాంబాబు, ముజ్జూరి నారాయణరావు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్: మండలంలోని శ్రీరాంపురంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో నాయకులు చించలపు గోవిందు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పిరుమళ్ల శివకుమార్, బళ్ల శ్రీను, ఎం. కనకేశ్వరరావు, గుంటుపుర పండు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: సీఎం నారా చంద్రబాబు పుట్టి రోజున వేడుకలు సుంకపూర్‌బీకేపల్లి, కెవెంకటాపురంల్లో టీడీపీ జిల్లా అధ్యక్షులు లాలంకాశీనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కోటవురట్లలో మండల పార్టీ అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు.పాములవాక, బోడపాలెంపీకేపల్లి చం ద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ పీ సూర్యరావు, వేచలపు జనార్ధన్,బాస్కరరావు, కసిరెడ్డి యేసు, సుంకర్‌బాబ్జి,బీకేపల్లి సర్పంచ్ పెట్ల లింగంనాయుడు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ధీఎస్సీ..

... 5వ పేజీ తరువాయి

ఉమ్మడి జిల్లాలో సుమారు 420 ఎస్జీటీ టీచర్లను మిగులుగా చూపిస్తున్నారు. దీనికితోడు టీచర్, విద్యార్థి నిష్పత్తి మేరకు ఖాళీలను భర్తీ చేస్తుండడంతో ఎస్జీటీల నియామకాలను తక్కువగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయంచింది. అయితే గత ప్రభుత్వం తీసుకువచ్చినజీవో 117ను రద్దు చేసిన ప్రస్తుత ప్రభుత్వం... కొత్త విధానాలను అమలు చేయనున్నది. ఇందువల్ల మోడల్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నందున వచ్చే ఏడాదికి పిల్లల చేరికపై కొంత పురోగతి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీఎస్సీలో తక్కువ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నందున ఆశావహుల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని చెప్పవచ్చు.

ఏజెన్సీలో 400 ఖాళీలు

ఉమ్మడి విశాఖ జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 400 ఖాళీలను భర్తీ చేయనున్నారు. మూడేళ్ల క్రితం వరకు జీవో నంబరు-3 ప్రకారం ఏజెన్సీలో వున్న టీచర్ పోస్టులన్నీ గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేసేవారు. అయితే ఈ జీవోను 2022లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కారణంగా ఐదో షెడ్యూల్‌లో వున్న ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలకు గిరిజనులతోపాటు గిరిజనేతరులకు అవకాశం వచ్చింది. గత ఏడాది సాధారణ ఎన్నికల సమయంలో జీవో నంబరు-3 పునరుద్ధరణకు కృషి చేస్తానని విపక్షనేత హోదాలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అన్ని పోస్టులను గిరిజనులతో భర్తీచేయాలని ఆదివాసీ అభ్యర్థులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి రూ15.29 లక్షల సాయం


ఆర్థిక సాయమందిస్తున్న గీత కార్మిక సంఘం ప్రతినిధులు

నక్కపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి వెన్నుముక దెబ్బతిని కదల్లేని స్థితిలో వున్న చినదొడ్డిగల్లుకు చెందిన గీత కార్మికుడు దొంగల శ్రీను కుటుంబానికి ఆదివారం 'సాయానికి పది రూపాయలు సంస్థ' ద్వారా రూ.15.29.251 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. గీత కార్మికుడు శ్రీను ఆపరేషన్‌కు డబ్బు అవసరమంటూ పది రూపాయల సంస్థ ప్రతినిధులు ఏసుబాబు, సారిధి సోషల్‌మీడియాలో సమాచారాన్ని పోస్ట్ చేశారు. ఈ మేరకు అనేకమంది స్పందించినట్టు జిల్లా గీతకార్మిక సంక్షేమ సంఘం ప్రతినిధులు గుత్తుర్తి పాండురంగ, దుంగా అప్పలరాజు, అప్పారావు, బత్తిన జగదీశ్, దొంగల రమణ చెప్పారు. ఈ మేరకు వసూలైన రూ 15,29,251లు నగదును శ్రీను భార్యభవానీకి మాజీ సర్పంచ్ వెలగా శ్రీను, మనం ట్రస్ట్ ఛైర్మన్ రమేశ్, షేక్ మీరా, కొర్నిబంగారు కానుసమక్షంలో అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఎస్. రాయవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1994-95 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం గ్రామ సమీపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా చదువుకొనే రోజుల్లో జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతా ఆట పాటలతో సంతోషంగా గడిపారు. మధ్యాహ్నం విందు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి. లక్ష్మణరావు, ఎస్. జోగిరాజు, టి. సురేశ్, పి.రాజా, బి. సతీష్, ఎ. కమల తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా


జాతీయ రహదారి, పి.ఎల్.పురం గ్రామాలలో డ్రోన్ వదిలిన దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.ఎల్.పురం, సీతారాంపురం, జాతీయ రహదారిపై ఆదివారం పోలీసు సిబ్బంది డ్రోన్ ద్వారా అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టినట్టు స్థానిక సీఐ జి.అప్పన్న తెలిపారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డ్రోన్ ద్వారా నిరంతం పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

సేంద్రీయ సాగులో ముందడుగు

... 5వ పేజీ తరువాయి

రైతులకన్నా ఒక అడుగు ముందుకు వుంటారు. గత పదేళ్లుగా ఇక్కడ పూర్తిగా సేంద్రీయ విధానంలోనే పంటలు సాగు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆధునిక విధానాలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని నిరూపిస్తున్న ఆయనతో 'ఆంధ్రజ్యోతి' మాటామంతీ..

రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించి పంటలను సాగు చేయడం వల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా భూమి భౌతిక పరిస్థితి దెబ్బతింటుంది. పంటలకు మేలు చేసే పలు రకాల పురుగులు, కీటకాలు నశిస్తాయి. మరోవైపు ఎరువులు, పురుగు మందులు వినియోగించి పండించిన పంటలపై.. ముఖ్యంగా కూరగాయలు, ఆకు కూరలపై వీటి అవశేషాలు వుంటాయి. వీటిని ఆహారంగా తీసుకుంటే పలురకాల దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదం వుందని శాస్త్రవేత్తలు పరిశోధనల ద్వారా నిర్ధారించారు. దీంతో పంటల సాగులో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించకూడదని సుమారు పదేళ్ల క్రితం నిర్ణయించుకున్నాను. ఇదే సమయంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రకృతి సాగును ప్రోత్సహించింది. దీంతో సేంద్రీయ వ్యవసాయంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాను. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, కషాయాలు తయారు చేసి వినియోగిస్తున్నాను. వీటి కోసం దేశవాళీ గోవులను కొనుగోలు చేసి పోషిస్తున్నాను.

కూరగాయ పంటలకు ప్రాధానం

మాకు సమీపంలో ఇటు విశాఖ నగరం, అటు అనకాపల్లి పట్టణం వుండడంతో కూరగాయలకు అధిక గిరాకీ వుంటుంది. దీంతో కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నాను.. టమాటా, వంగ, బెండ, మిరప, మునగ, బీర, బరబాటీ, క్యాబేజీ, కాలీఫ్లవర్ పంటలు పండిస్తున్నాను. ఇంకా వరి, కొర్ర పంటలతోపాటు బొప్పాయి, పుచ్చ వంటి పండ్ల తోటలను కూడా సాగు చేస్తున్నాను. వీలైనంత వరకు పెట్టుబడి, ఖర్చులను తగ్గించుకుంటూ, నాణ్యమైన అధిక దిగుబడుల సాధనకు ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్నాను. టమాటా సాగులో ట్రెల్లీ విధానాన్ని పాటిస్తున్నాను. నీటి వినియోగాన్ని తగ్గించడానికి, కలుపు బెడద లేకుండా వుండడానికి బెడ్‌లు ఏర్పాటు చేసి మల్చింగ్ షీట్స్ వినియోగిస్తున్నాను.

వంగలో గ్రాఫ్టింగ్ విధానం..

రెండేళ్లపాటు కాపు

ఈ ఏడాది ప్రయోగాత్మకంగా అంటు కట్టే విధానంలో వంగ సాగు ప్రారంభించాను. ఆనందపురం మండలం తర్లువాడ వద్ద నర్సరీలో అంటు కట్టి మొక్కలు సరఫరా చేస్తున్నారు. మనం ఇచ్చిన విత్తనం నారు పోసి మొక్కలు ఎదిగిన తరువాత వారి వద్ద వుండే అడవి వంగకు అంటు కట్టి ఇస్తున్నారు. ఒక్కో వంగ మొక్కకు రూ.10 తీసుకుంటున్నారు. పొలంలో మొక్కల మధ్య నాలుగు అడుగులు, వరసల మధ్య ఆరు అడుగుల దూరం వుండేలా నాటాం. కాపు మొదలైనప్పటి నుంచి రెండేళ్ల పాటు దిగుబడులు వస్తాయి.

మార్కెట్‌లో డిమాండ్.. మంచి ధర

సేంద్రీయ విధానంలో సాగు చేసిన పంటలకు డిమాండ్ ఉంది. విశాఖలోని గోపాలపట్నంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇతరచోట్ల కంటే ఇక్కడ కిలోకు రూ.2-3 ఎక్కువ ధర లభిస్తున్నది. సేంద్రీయ విధానంలో సాగు చేసే రైతులు పరిమితంగా వుండడంతో మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టు దిగుబడులు లేవు. గత ఏడాది 1.5 ఎకరాల్లో బొప్పాయి వేశాను. ఇంతవరకు అన్నీ కలిపి సుమారు రూ.2 లక్షలు ఖర్చుచేశాను. ఏడాదిలో సుమారు 15 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను సగటున రూ.30 వేల ధర లభించింది. ఖర్చులు పోను రూ.2.5 లక్షలు మిగిలాయి. వాతావరణం అనుకూలిస్తే మరో ఏడెనిమిది నెలలపాటు దిగుబడి వస్తుంది. మొదటి ఏడాదితో పోలిస్తే ఖర్చులు సగం కూడా వుండవు. మరో రెండు లక్షల రూపాయల వరకు మిగిలే అవకాశం వుంది.

జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

ఎస్. రాయవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్రివానిపాలెంలో స్థానిక జనసేన పార్టీ నేతలు నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండాను ఆదివారం పాయకరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గెడ్డం బుజ్జి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జనసేన పార్టీ మరింత బలోపేతమైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కర్రి నాగ వెంకట సత్యనారాయణ, టీడీపీ అధ్యక్షుడు కర్రి అప్పారావు, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, ఉప సర్పంచ్ కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయంలో రద్దీ


అమ్మవారి పూజల్లో భక్తులు

నక్కపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి శక్తి క్షేత్రాన్ని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నవదుర్గ సహిత అష్టాదశ శక్తి పీఠాల దేవతామూర్తులతో కూడిన గూడుపమ్మతల్లిని భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక హారతులిచ్చారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. స్థానిక ఎస్ఐ సన్నిబాబు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా ఈస్టర్ పండుగ


కోటవురట్ల కేకేబి చర్చిలో వ్యాకం బోధిస్తున్న పాస్టర్ పీఆర్‌బాబు

కోటవురట్ల, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):ఈస్టర్ పండుగను ఆదివారం మండలంలోని క్రైస్తవ ఆలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన కోటవురట్ల కేకేబీ చర్చి, ,బేతెస్థ ప్రార్థనమందిరం భక్తులతో కిటకిటలాడాయి. ఈసందర్భంగా క్రైస్తవులు వారి కుటుంబీకులు మరణించి సమాధులను రంగులువేసి, పూలతో అలకరించి ఆదివారం తెల్లవారు జామున 4గంటల ప్రాంతంలో నివాళి అర్పించారు. ఈ నేపథ్యంలో సమాధులు వద్ద సందడిగా నెలకొంది. క్రైస్తవులు ఇళ్లలో రుచికరమైన వంటకాలు తయారు చేసుకున్నారు. కొత్తవస్త్రాలు దస్తులు ధరించి చర్చిలకు వెళ్లారు. చర్చిల వద్ద ఈస్టర్ ప్రార్థనలు జరుపుకున్నారు. సంఘపెద్దలు మట్ల ఆనందరాజ్, ఎంశ్యామ్‌ప్రసాద్, ఆర్ ప్రసన్నకుమార్, మట్లసునాథ్‌బాబు, ఎస్ సాంధీప్‌రాజు, ఆర్. నానిమణిమోహన్ పాల్గొన్నారు.

నూకాంబికకు నీరా'జనం'

▸ వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి రాక ▸ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం ఆవరణలో కోలాహలం

▸ రోడ్డుపైకి చేరిన క్యూ లైన్లు ▸ కాటేజీలు, పరిసరాలు ఖాళీ లేక మరిడిమాంబ ఆలయ సమీపంలో పలువురు వంటలు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య జాతర కొనసాగుతున్న నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు. తెల్లవారుజాము ఆరు గంటలకు బాలాలయంలోని అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి ఆలయానికి వచ్చే మార్గాలన్నీ సందడిగా మారాయి. ఆలయం లోపల, ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు నిండిపోవడంతో రోడ్డుపైన ఎండలో భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. ఆవరణలోని కాటేజీలు, పరిసర ప్రాంతాలు నిండిపోవడంతో కుటుంబ సమేతంగా వచ్చిన పలువురు భక్తులు మరిడిమాంబ ఆలయ సమీపంలోని తోటల్లో వంటలు వండుకుని అమ్మకు నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా భక్తుల తాకిడి తగ్గలేదు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి, ఈవో రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండేవారు. ఉత్సవ కమిటీ సభ్యులు దాడి రవికుమార్, సూరే సతీష్, మారిశెట్టి వెంకటరావు, మజ్జి శ్రీనివాసరావు, కాండ్రేగుల రాజారావు, పోలిమేర ఆనంద్, కొడుకుల శ్రీకాంత్ తదితరులతో పాటు పలువురు భక్తులు క్యూలైన్లలో ఉన్నవారికి మజ్జిగ, మంచినీరు అందించారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇదిలావుంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఆయన క్షేమంగా ఉండాలని కోరుతూ గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మ వారిని దర్శించుకున్న జేసీ జాహ్నవి దంపతులు

నూకాంబిక అమ్మవారిని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఈపీడీసీఎల్ ఎండీ పృథ్వీతేజ్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరికి ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను స్వాగతం పలికారు. బాలాలయంలో అమ్మవారికి పూజల అనంతరం వీరిని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.

'చౌర్య పాఠం' యూనిట్ అమ్మవారికి పూజలు

నూకాంబిక అమ్మవారిని ఆదివారం రాత్రి 'చౌర్య పాఠం' చిత్ర యూనిట్ దర్శించుకుంది. దర్శకుడు నక్కిన త్రినాథరావు, హీరో ఇంద్ర, హీరోయిన్ పాయల్, నటుడు రాజీవ్ కనకాల అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వీరిని ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.



జేసీ జాహ్నవి దంపతులకు చిత్రపటాన్ని అందిస్తున్న నాగశ్రీను



అమ్మవారిని దర్శించుకుంటున్న చౌర్య పాఠం చిత్ర యూనిట్

ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం



పురస్కారాల్లో భాగంగా శాస్త్రవేత్తను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం రాత్రి ప్రదర్శితమైన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య బ్రదర్స్, వారి కళాకారుల బృందం ఆలపించిన క్లాసికల్ భక్తి గేయాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, పి.శ్రీదేవి, విశాలాక్షి మహంతిలకు ఉగాది పురస్కారాలను అందజేసి సత్కరించారు. అలాగే సినీ దర్శకులు నక్కిన త్రినాథరావుకు ఈ పురస్కారాన్ని ఎమ్మెల్యే కొణతాల అందజేశారు. ఈ కార్యక్రమానికి చౌర్య పాఠం చిత్ర యూనిట్ సభ్యులు ఇంద్ర, పాయల్, నిఖిల్, రాజీవ్ కనకాల, నక్కిన త్రినాథరావు తదితరులు హాజరయ్యారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్నిమాపక పరికరాల ప్రదర్శనలో అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగేటప్పుడు వాటిని నియంత్రించే పరికరాల ఎగ్జిబిషన్‌ను ఇక్కడి అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేశారు. పలువురు పట్టణవాసులు వీటిని ఆసక్తిగా తిలకించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖాధికారి పి.నాగేశ్వరరావు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి'

తుమ్మపాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ కోరారు. అనకాపల్లిలో ఆదివారం జరిగిన పార్టీ మండల నాయకుల సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారం చేపట్టి పదకొండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. అనంతరం సీపీఐ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వియ్యపు రాజు, సమితి సభ్యులుగా బోయిన గోవిందు, డొక్కరి హరీష్, చెల్లూరి నాగరాజు, ఒరిగిటి మహాలక్ష్మీనాయుడు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సందడి



సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సబ్బవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1981-82 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. అదే విధంగా మండలంలోని నంగినారపాడు హైస్కూల్‌లో 2000-2001 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా ఓ చోట చేరడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాల్లో వీఎస్ఆర్ మూర్తి, రామునాయుడు, కేవీ రమణ, ఏవీఎస్ఎస్ శర్మ, రామకృష్ణ, కనకరాజు, శ్రీనివాసరావు, చిన్నం నాయుడు, రమణి, సుజాత, కోమలి, రాజేశ్వరి, పద్మావతి తదితరలు పాల్గొన్నారు.

టీసీఎస్‌కు భూముల కేటాయింపుపై వైసీపీ విమర్శలు అర్థరహితం

▸ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ



విలేకరులతో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో టీసీఎస్‌కు భూముల కేటాయిపుపై వైసీపీ చేస్తున్న విమర్శలు అర్థరహితమని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ కార్యాలయాల కోసం వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కొట్టేశారని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలను ఆకర్షించి తద్వారా యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూముల కేటాయింపులు చేస్తున్నారని వివరించారు. జగన్ సీఎం పదవి నుంచి దిగిపోయేనాటికి రాష్ట్రాభివృద్ధి సూచి 4.5 ఉంటే, పది నెలల్లో చంద్రబాబు దానిని 9.4కు తీసుకు వెళ్లారని స్పష్టం చేశారు. ఈ గ్రోత్ దేశంలోనే రెండవ స్థానంగా పేర్కొన్నారు. రిసార్టు కోసం రూ.500 కోట్లు ఖర్చు చేసిన ఘనత వైసీపీదేనని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు విమర్శలు చేసే ముందు ఆలోచన చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణనగర్‌లో కేక్ కట్‌చేస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



సబ్బవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి గండి బాబ్జీ తదితరుల నివాళి

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

▸ వాడవాడలా కేక్‌లు కట్ చేసిన కూటమి శ్రేణులు ▸ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ▸ ఆలయాల్లో పూజలు



చంద్రబాబు జన్మదిన కేక్ కట్‌చేసిన అనంతరం మాజీ ఎమ్మెల్యే పీలాకు తినిపిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. పట్టణశాఖ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా చంద్రబాబు జన్మదిన కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కూటమి నాయకులు విజయ్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కోట్ని బాలాజీ, కాండ్రేగుల సత్యనారాయణ, మళ్ల రామకృష్ణ, పొలిమేర నాయుడు, దాడి భోగలింగం, బుద్ద కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ రక్తదాన శిబిరం ప్రారంభించారు. అనంతరం రోగులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు, మజ్జిగ పంపిణీ చేశారు. వైద్యాలయం వద్ద ఆయన సీఎం చంద్రబాబు జన్మదిన కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఎంపీ సీఎం రమేష్ కార్యాలయ ప్రతినిధి విజయ్, మాదంశెట్టి నీలబాబు పాల్గొన్నారు. అలాగే లక్ష్మీనారాయణనగర్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం దివ్యాంగులకు రత్నాకర్ చేతుల మీదుగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. నాయకులు శిలపరశెట్టి బాబి, విల్లూరి రాము, బొడ్డేడ శంకరరావు, రేబాక మధుబాబు తదితరులు పాల్గొన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర 81వ వార్డులో చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. 80వ వార్డు జనసేన నాయకుడు కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్యాలయానికి రెండువేల రూపాయల విలువ గల మందులు అందజేశారు. అలాగే ఐదు వార్డుల్లో టీడీపీ నాయకులు వాడవాడలా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు.

ఎన్టీఆర్ స్టేడియంలో...

ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో నూకాంబిక కొత్త అమావాస్య జాతరలో భాగంగా ఏర్పాటైన సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన వేదికపై ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, పీలా నాగశ్రీను, మాదంశెట్టి నీలబాబు, పొలిమేర నాయుడు, చదరం నాగేశ్వరరావు, వేదుల ప్రభ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు జనసేన కార్యాలయంలో...

కొత్తూరు : ఇక్కడి జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిచారు. ఆ పార్టీ నాయకులు దూలం గోపి, మంగా ఈశ్వర్, చదరం నాగేశ్వరరావు, భరత్‌బాబు తదితరులు కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పరిపాలనా దక్షతకు మారుపేరు చంద్రబాబు అని, పాలనా వ్యవస్థ గాడిలో పడాలంటే ఆయన నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బుద్ద

జి.భీమవరంలో...

కశింకోట : జి.భీమవరంలో ఉపాధి హామీ పథకం కూలీల సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆపార్టీ శ్రేణులు నిర్వహించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ హాజరై కేక్ కట్‌చేశారు. అనంతరం కూలీలకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఉగ్గిన రమణమూర్తి, కాయల మురళీ, గొంతిన శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి సత్తిబాబు, విజయ్, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న పీలా, చిత్రంలో గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర

సబ్బవరంలో...

సబ్బవరం : సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను సబ్బవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ చంద్రబాబు జన్మదిన కేక్‌కట్ చేసి పార్టీ నేతలకు తినిపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బెడ్‌షీట్లు, పండ్లు పంచిపెట్టారు. పార్టీ నాయకులు గండి వంశీదీప్, గండి దేముడు, ముత్యాలనాయుడు, భరిణికాన బాబూరావు, ఎం.మహాలక్ష్మీనాయుడు, గవర అప్పారావు, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, ఎల్లాజీ, గవర సత్తిబాబు, కన్నంనాయుడు, రొంగలి దేముడు తదితరులు పాల్గొన్నారు.

గొర్లివానిపాలెంలో...

పరవాడ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను గొర్లివానిపాలెం వద్ద గల టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు కేక్‌కట్ చేశారు. అనంతరం పరవాడ పీహెచ్‌సీలో బట్టలు, రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు గండి వంశీ, ఇందల కొండలరావు, పైలా రామచంద్రరావు, బొండా సన్నిదేముడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, పైలా వరలక్ష్మి, గొర్లి కనకారావు, నగిరెడ్డి చిన్నారావు, బొండా తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సాలాపువానిపాలెం...

లంకెలపాలెం : చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు సాలాపువానిపాలెంలో టీడీపీ నేత సాలాపు మోహన్‌రావు ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని 84వ వార్డు కార్పొరేటర్ దంపతులు మాదంశెట్టి చినతల్లి, నీలబాబులు ప్రారంభించారు. అంతకుముందు జన్మదిన కేక్‌కట్ చేశారు. కూటమి నాయకులు నాగరాజు, చినవెంకటరమణ, భాస్కర్, గోవింద్, తాతారావు, వెంకట అప్పారావు, సాలాపు శివ, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



పరవాడ : గొర్లివానిపాలెంలో కేక్ కట్‌చేస్తున్న నేతలు



కొత్తూరు జనసేన కార్యాలయంలో వేడుకలు



పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేసిన రత్నాకర్

త్వరలో 'క్రెబ్స్' యాజమాన్యంతో ఎమ్మెల్యే కొణతాల చర్చలు

కొత్తూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరంలో గల క్రెబ్స్ బయో కెమికల్ కంపెనీ యాజమాన్యంతో త్వరలో చర్చలు జరపనున్నట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో ఇబ్బందులు తలెత్తడంతో అందులో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలు నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యే కొణతాలకు పలువురు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. త్వరలోనే యాజమాన్యంతో చర్చించి ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన వివరించారు. అంతేకాకుండా లే ఆఫ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇందుకు యాజమాన్యం కూడా అంగీకరించిందని, ఈ విషయంలో ఉద్యోగులు ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు షిర్డీ సాయిబాబా దివ్య మందిరం వార్షికోత్సవం

పరవాడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : పి.బోనంగిలో గల షిర్డీసాయిబాబా దివ్య మందిరం ప్రథమ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. వేకువజాము నుంచి బాబాకు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు జరుపుతామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం పది గంటలకు లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యం, దత్తాత్రేయ, నవగ్రహ మూల మంత్రములతో హోమం, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం ఉత్సవ విగ్రహం పల్లకిలో ఊరేగింపు ఉంటాయన్నారు.

బండమ్మతల్లి అనుపోత్సవం



సబ్బవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరి పాక, పెదయాతపాలెం, చినయాతపాలెం గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బండమ్మతల్లి అనుపోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే దర్శనానికి భక్తులు బారులుతీరారు. సాయంత్రం తప్పెటగుళ్లు, కోలాటం, సాముగరిడీలు, బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు, అనుపోత్సవం జరిగింది. ఈ వేడుకల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు, ఇందలి రమణలతో పాటు గ్రామ పెద్దలు శరగడం శంకరరావు, రాము, ఆడారి నాగరాజు, బొడ్డేటి మహాలక్ష్మీనాయుడు, ఆడారి వెంకట్, మల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుక



తుమ్మపాల చర్చిలో సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ సీహెచ్.రాజు

తుమ్మపాల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఈస్టర్ వేడుకను అనకాపల్లి మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు ప్రపంచ మానవాళి పట్ల చూపించిన ప్రేమ, త్యాగాన్ని పాస్టర్లు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పొరుగువారి పట్ల ప్రేమ కలిగి జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.



కశింకోటలో క్రీస్తు బోధనలు వివరిస్తున్న పాస్టర్ మూర్తి

కశింకోట : ఇక్కడి గవరపేట వీధిలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ఈస్టర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మూర్తి జేమ్స్ మాట్లాడుతూ ఏసుప్రభువు మానవాళికి ఇచ్చిన సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో సంఘ విశ్వాసులు, పెద్దలు కె.శ్యామలరాజు, కె.మదన్‌కుమార్, ఎస్.మధుసూదన్, కె.కృపావరప్రసాద్, ఎస్.కృపావరం తదితరులు పాల్గొన్నారు.


అనంతగిరి: కాశీపట్నం వద్ద కేక్ తినిపిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, నాయకులు


రక్తదాన శిబిరంలో పాల్గొన్న టీడీపీ పాడేరు ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తదితరులు

నిరుపేదల జీవితాల్లో వెలుగే చంద్రబాబు లక్ష్యం

- సీఎం జన్మదిన వేడుకల్లో ఆ పార్టీ నేతలు
- వాడవాడలా ప్రత్యేక సేవా కార్యక్రమాలు

పాడేరురూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఆ పార్టీ నేతలు అన్నారు. చం ద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆదివారం పాడేరులో ఘనంగా, నిర్వహించారు. ముందుగా కుమ్మరిపుట్టులోని ఈశ్వరి నివాసం గృహంలో కేక్ కట్ చేశారు. అక్కడ నుంచి పార్టీ శ్రేణులు తలారిసింగి జంక్షన్ మీదుగా జిల్లా ఆస్పత్రి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం మోదకొండమ్మ ఆలయంలో చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రక్తదాన శిబిరంలో ఈశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజుతోపాటు నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు, ఎన్టీఆర్ అభిమానులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 2 వేల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, చల్లంగి లక్ష్మణరావు, నంది కృష్ణ, ఎస్వీరమణమూర్తి, వైస్‌ఎంపీపీ జి.శివకుమార్, టీడీపీ నాయకులు కూడి రామునాయుడు, వి.కొండలరావు, పూర్ణచందరరావు, ఎం. రమేష్, దొరబాబు, డిప్పల వెంకట కుమారి, నియోజకవర్గ పరిధిలోని మండలాల నాయకులు పాల్గొన్నారు.

కిడారి క్యాంపు కార్యాలయంలో....

చంద్రబాబు జన్మదిన వేడుకలను జీసీసీ చైర్మన్, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ క్యాంప్ కార్యాలయంలో నేత పాంగి పాండు రంగస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణరాజు, నాయకుడు సాగర సుబ్బారావు, దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి, అండిభ సర్పంచ్ టి.సత్యనారాయణలు వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు.

అనంతగిరి: నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కాశీపట్నంలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదిన వేడుకలను గిరిజనుల సమక్షంలోని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన గత పది నెలల్లో చం ద్రబాబు ప్రజలందరికీ మంచిపాలన అందించారన్నారు. .ఈ సందర్భంగా రామాలయం వద్ద జీసీసీ చైర్మన్ ప్రత్యేక పూజలు చేశారు. ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి సేవలందించారు. 200 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోని టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు అప్పారావు, నాయకుడు పాండురంగస్వామి, సర్పంచ్ లక్ష్మి, ఎమ్.జోగులు, ఎస్.దొన్ను, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, వీరన్నదొర, పుష్పానందం, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: ప్రజా సంక్షేమమే పరమావధిగా కాంక్షించే నేత ముఖ్యమం త్రి చంద్రబాబుఅని టూరిజం డైరక్టరు కిల్లు రమేష్‌నాయుడు, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ ఎంవీవీ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జి. సత్యనారాయణ కార్యదర్శి తోట దొరబాబు తదితరులు కొనియాడారు. ఆదివారం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో నిర్వహించారు. రాజేంద్రఎపాలెం పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ మండల కార్యదర్శి తోట దొరబాబు ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి సీహెచ్‌సీ లో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎంవీ ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు నేతలు చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని సింహాచలం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేతలు కొర్రు రామూర్తి, వుల్లయ్య, సన్యాసిరావు, మాజీ సర్పంచ్‌లు శంకరరావు, సాలెబు సన్యాసిరావు, వై. వరహాలబాబు, బండి సన్యాసిరావు, బంటు లక్ష్మయ్య పాల్గొన్నారు.

చింతపల్లి: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నవ్యాంధ్ర సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు సేవలు అభినందనీయమని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు జరిగాయి. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, లక్కోజు నాగభూషణం, శెట్టి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అరడ వీరబాబు, సర్పంచ్ చింతర్ల సునీల్ పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ సెంటర్‌లో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిటికెల రాము, సీలేరు పట్టణ తేదేపా అధ్యక్షుడు కె సన్యాశిరావు, సీనియర్ నాయకుడు బొర్రా కృష్ణ, వై నూకరాజు, కూటమి నాయకులు వనముల రాము, గోవింద్, చంద్రరావు, కాళీ, కృష్ణ, బాలకృష్ణ, లక్ష్మణ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఏపీటూరిజం డైరెక్టర్ కిల్లు రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో చం ద్రబాబు జన్మదినం పురస్కరించుకుని కేక్‌ను కట్ చేశారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్.అప్పలరాజు, నాయకులు ఎస్.చిట్టిబాబు, కె.సింహాచలం, ఎం.నారాయణరాజు, కేవీఎస్.ప్రసాద్, పిన్నయ్య, ఎస్.కొండలరావు, కె.బ్రహ్మలింగం, ఎస్. మత్స్యరాజు,వంశీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక కిడారి సామాజిక భవనంలో చంద్రబాబు జన్మదిన వేడుకలనుటీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యాన నిర్వహించారు. పీహెచ్‌సీలోని రోగులకు రొట్టెలు, పాలు అందజేశారు. స్వామి, వెంకటరాజు, బీమరాజు, జక్కయ్య, పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: దేవరాపల్లిలో సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు చంద్రబాబు జన్మదినోత్సవ కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు లకేరామరావు, బాలరుద్ర శ్రీనివాస్‌రావు, పాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి, సీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. సర్పంచులు లక్ష్మణ్, శివశంకర్, టీడీపీ నేతలు జగన్నాథ్, బాబూజీ, రామస్వామి, సన్యాసమ్మ, శంకర్, చిన్నిబాబు, కామరాజు, రామారావు, భీమన్న, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరురూరల్: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుళ్లి సుబ్బారావు ం చంద్రబాబు ఆరోగ్య వంతంగా ఉండాలని కోరుతూ శ్రీపూర్ణపుష్కల అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలను చేపట్టారు. టీడీపీ నాయకులు రొబ్బి రాము, ఎం.మత్స్యరాజు, కె.ప్రశాంత్, పూసర్ల గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొయ్యూరు: రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు


ముంచంగిపుట్టులో రోగులకు పండ్లు, రొట్టెలు అందిస్తున్న నాయకులు


సీలేరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


చింతపల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సీఎంకు గిరిజనులంటే ప్రత్యేక అభిమానం

విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర


అరకులోయ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినోత్సవం అరకు లోయలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్ను దొర , పెదలబుడు పంచాయతీ సర్పంచ్ దాసుబాబు, పార్టీ నాయకులతో కలిసి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం మాదల గ్రామ పంచాయతీ సరుబెడ్డ పీవీటీసీ గ్రామంలో గిరిజనుల సమక్షంలో కేక్ కట్ చేశారు. మాదల సర్పంచ్, టీడీపీ నేత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలకు చీరలను నాయకులు, దొన్నుదొర దంపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు థింసా నృత్యంతో సందడి చేశారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గిరిజనులంటేఅభిమానం అన్నారు. గతంలో ఆయన సీఎంగా పెదలబుడు గ్రామ పంచాయతీని దత్తత తీసుకున్నారు. పంచాయతీ పరిధిలో ఇళ్లు,రహదారులు, కళాశాలలు అందుబాటులోకి తెచ్చారన్నారు.


సరుబెడ్డలో గిరిజన మహిళ చీర అందిస్తున్న దొన్నుదొర

కిడారి ఆర్థిక సాయంతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

అనంతగిరి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబా బు జన్మదినం పురస్కరించుకుని.. మండలంలోని కొత్తూరు పం చాయతీ కేంద్రంలోని జీసీసీ చైర్మెన్ కిడారి శ్రావణ్‌కుమార్ తన సొంత ని. ధులు రూ. 3 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ ను ఆదివారం నాయకులు, కార్యకర్తలు సమక్షంలోని ఆయన ప్రారంభించారు.. ఈ సందర్భంగా కిడారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. కలుషిత నీటితో గ్రామస్థులు అనారోగ్యానికి గురవుతున్నందున ఈ ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ఉప సర్పంచ్ జి.నరేంద్ర, లక్ష్మణ్‌రావు, శ్యామ్, దారెల సర్పంచ్ పాండురంగస్వామి, నాయకుడు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు..

కురిడిలో రక్తదాన శిబిరం


రక్త పరీక్షలు చేస్తున్న రోటరీ క్లబ్ సిబ్బంది

డుంబ్రిగుడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిడి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ సత్రంలో సన్ గ్రీన్ రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో రక్తదాన, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రెసిడెంట్(దిల్లి) డాక్టర్ శ్రుతి తండ్రి కర్రి సూర్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. జన సైనికులు రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ సిబ్బంది గిరిజనులు, యువత పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఇటుకల పండుగ సందడి

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గల పలు గ్రామాల్లో ఆదివారం ఇటుకల పండుగ సందడి నెలకొంది. సంప్రదాయాల ప్రకారం శంకుదేవునికి ప్రత్యేక పూజలు చేశారు. మగవారంతా వేట కోసం కొండ, అటవీ బాట పట్టగా, మహిళలు గ్రామాల రహదారులపై వాహనదారుల నుంచి తాచేరు(చందా) వసూలు చేస్తున్నారు.

చింతలవీధి మోదకొండమ్మ ఉత్సవాలు ప్రారంభం

పాడేరురూరల్: మండలంలోని చింతలవీధిలో మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో ఘనంగా పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలు, ఘటాలను భారీ ఊరేగింపుగా సతకం పట్టు వద్ద కొలువుతీర్చారు. ఈ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండమ్మ జాతర..

కొయ్యూరు: శరభన్నపాలెం- నడింపాలెం గ్రామాల మధ్య వెలసిన ఎర్రగొండమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఉదయం ఆలయ పూజారి అంకురార్పణతో ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతరకు ఆలయ కమిటీ చైర్మన్ గొడ్డేటి మహేశ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నడింపాలెం నుంచి శరభన్నపాలెం మధ్య విద్యుదీపాలంకరణ చేశారు. జాతర లో భాగంగా వెలగలపాలెం బట్టపణుకుల పంచాయతీల ఆర్థిక సహాయంతో ఆదివారం విశాఖపట్నం ఆర్‌జీవీ వారిచే డ్యాన్స్ మస్తీ డ్యాన్స్ సాంస్కృతి కార్య క్రమం నిర్వహిస్తామన్నారు.


మోదకొండమ్మ ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న పెద్దలు

ఘనంగా 'అల్లూరి' పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

అరకులోయ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పిల్లలను బాధ్యతాయువత పౌరులుగా తీర్చిదిద్దాలని సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం అరకులోయలో అల్లూరిసీతారామరాజు పబ్లిక్ స్కూల్ 40వ వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. పిల్లలు చక్కటి విద్య అందించాలన్నారు. ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించాలని కోరారు. ఈ సందర్భంగా మన్యం వీరుడు అల్లూరిసీతారామరాజు జీవిత చరిత్రను వివరించారు. ఈ పాఠశాల వ్యవస్థాపకుడు అల్లూరి మూర్తిరాజు.. అరకులోయ వంటి గిరిజన ప్రాంతంలో ఈ స్కూల్ స్థాపనకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ప్రేరణని వివరించారు. లక్ష్మీనారాయణ చిన్నారులకు సర్టిఫికేట్‌లు, మెడల్స్ ప్రదానం చేశారు. సందర్భంగా చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు, పాఠశాల డైరెక్టర్ కరసయ్య, ప్రిన్సిపాల్ వర్మ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, త్రినాధరావు, నిశ్చల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిన్నారులలో మాజీ సీబీఐ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

భక్తి శ్రద్ధలతో ఈస్టర్

పాడేరురూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏసు క్రీస్తు సందేశం అనుసరణీమని పాస్టర్లు బిషప్ సీహెచ్.దైవకృప, ఎం.బాబూరావు, పి.ప్రెడ్రిక్, తిమోతీ, వైవై.రత్నం, ఎం.డానియల్, ప్రేమ్‌కుమార్, మత్స్యరాజు, జాషువా అన్నారు. పాడేరు పట్టణంలోని అన్ని చర్చిల్లో ఈ వేడుకలను ఆదివారం ఘనంగా చేపట్టారు. క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందించారు. గుడ్‌ఫ్రైడే రోజున శిలువ మరణం పొంది మూడోదినం ఆదివారం పునరుత్తానుడై తనరక్తంతో పాపాలను కడిగి క్షమాగుణాన్ని అందించారన్నారు.

చింతపల్లి: చింతపల్లి ఆదివాసీ ప్రభావిత పథకం చర్చిలో పాస్టర్ అరడ చిన్నబ్బాయి, యేసు క్రీస్తు ప్రార్థన మందిరం, యూసీఐఎం చర్చిల్లో రెవరెండ్ పి. డేవిడ్‌రాజు, మార్కొస్, గేదలపాలెం, మాడెం యేసుక్రీస్తు ప్రార్థన మందిరాల్లో పాస్టర్ ఎం. భూషణం, జాన్‌పీటర్ ఈస్టర్ పురస్కరించుకుని వాక్యోపదేశం చేశారు. ఈస్టర్‌కి చిహ్నంగా క్రైస్తవులు చర్చిలకు పూలను తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. ఈకార్యక్రమంలో సంఘ పెద్దలు బుజ్జిబాబు, వెంకటరావు, పాస్టర్ జెషూరున్, సభ్యురాలు డెబోరా పాల్గొన్నారు.

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో పలు చర్చిల్లో ఆదివారం ఘనంగా ఈస్టర్ వేడుకలను నిర్వహించారు. యూసీఐఎం చర్చి పాస్టర్ మనస్సే ఆధ్వర్యంలో స్థానిక చర్చి వెనుక గల క్రైస్తవుల సమాధులను పూలతో అలంకరించి వారి కుటుంబ సభ్యులతో కలసి కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.

కొయ్యూరు: రాజేంద్రపాలెం యునైటెడ్ చర్చి ప్రబోధకురాలు సియోను కుమారి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏసుక్రీస్తు పునరుద్ధానుడైనట్టు ప్రకటిస్తూ భక్తి గీతాలాపనలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. రావణాపల్లి కొమ్మిక, శరభన్నపాలెం, కాకరపాడు తదితర ప్రార్థనామందిరాలలో ప్రార్థనలు చేశారు.


పాడేరు: ఈస్టర్ వేడుకల్లో క్రైస్తవ సోదరుల ప్రార్థనలు

యువత క్రీడల్లో రాణించాలి: మాజీ మంత్రి బాలరాజు

చింతపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు. ఆదివారం స్థానిక ముత్యాలమ్మ జాతర పురస్కరించుకుని ఏర్పాటు చేసిన షటిల్ పోటీలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. విజయభారతితో కలిసి మాజీ మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ క్రీడల్లో రాణించే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు, పీఆర్ ఏఈఈ కిముడు జ్యోతిబాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు పాల్గొన్నారు.


క్రీడాకారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు

డీఎస్సీ..

... 5వ పేజీ తరువాయి

ఉమ్మడి జిల్లాలో సుమారు 420 ఎస్జీటీ టీచర్లను మిగులుగా చూపిస్తున్నారు. దీనికి తోడు టీచర్, విద్యార్థి నిష్పత్తి మేరకు ఖాళీలను భర్తీ చేస్తుండడంతో ఎస్జీటీల నియామకాలను తక్కువగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయంచింది. అయితే గత ప్రభుత్వం తీసుకువచ్చినజీవో 117ను రద్దు చేసిన ప్రస్తుత ప్రభుత్వం... కొత్త విధానాలను అమలు చేయనున్నది. ఇందువల్ల మోడల్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నందున వచ్చే ఏడాదికి పిల్లల చేరికపై కొంత పురోగతి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీఎస్సీలో తక్కువ పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నందున ఆశావహుల మధ్య తీవ్ర పోటీ ఉంటుందని చెప్పవచ్చు.

ఏజెన్సీలో 400 ఖాళీలు

ఉమ్మడి విశాఖ జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 400 ఖాళీలను భర్తీ చేయనున్నారు. మూడేళ్ల క్రితం వరకు జీవో నంబరు-3 ప్రకారం ఏజెన్సీలో వున్న టీచర్ పోస్టులన్నీ గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేసేవారు. అయితే ఈ జీవోను 2022 లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కారణంగా ఐదో షెడ్యూల్‌లో వున్న ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలకు గిరిజనులతోపాటు గిరిజనేతరులకు అవకాశం వచ్చింది. గత ఏడాది సాధారణ ఎన్నికల సమయంలో జీవో నంబరు-3 పునరుద్ధరణకు కృషి చేస్తానని విపక్షనేత హోదాలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అన్ని పోస్టులను గిరిజనులతో భర్తీచేయాలని ఆదివాసీ అభ్యర్థులు కోరుతున్నారు.

సేంద్రీయ సాగులో ముందడుగు

... 5వ పేజీ తరువాయి

రైతులకన్నా ఒక అడుగు ముందుకు వుంటారు. గత పదేళ్లుగా ఇక్కడ పూర్తిగా సేంద్రీయ విధానంలోనే పంటలు సాగు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆధునిక విధానాలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని నిరూపిస్తున్న ఆయనతో 'ఆంధ్రజ్యోతి' మాటామంతీ...

రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించి పంటలను సాగు చేయడం వల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా భూమి భౌతిక పరిస్థితి దెబ్బతింటుంది. పంటలకు మేలు చేసే పలు రకాల పురుగులు, కీటకాలు నశిస్తాయి. మరోవైపు ఎరువులు, పురుగు మందులు వినియోగించి పండించిన పంటలపై.. ముఖ్యంగా కూరగాయలు, ఆకు కూరలపై వీటి అవశేషాలు వుంటాయి. వీటిని ఆహారంగా తీసుకుంటే పలురకాల దీర్ఘకాలిక వ్యాధులబారిన పడే ప్రమాదం వుందని శాస్త్రవేత్తలు పరిశోధనల ద్వారా నిర్ధారించారు. దీంతో పంటల సాగులో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించకూడదని సుమారు పదేళ్ల క్రితం నిర్ణయించుకున్నాను. ఇదే సమయంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రకృతి సాగును ప్రోత్సహించింది. దీంతో సేంద్రీయ వ్యవసాయంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాను. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, కషాయాలు తయారు చేసి వినియోగిస్తున్నాను. వీటి కోసం దేశవాళీ గోవులను కొనుగోలు చేసి పోషిస్తున్నాను.

కూరగాయ పంటలకు ప్రాధానం

మాకు సమీపంలో ఇటు విశాఖ నగరం, అటు అనకాపల్లి పట్టణం వుండడంతో కూరగాయలకు అధిక గిరాకీ వుంటుంది. దీంతో కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నాను.. టమాటా, వంగ, బెండ, మిరప, మునగ, బీర, బరబాటీ, క్యాబేజీ, కాలీఫ్లవర్ పంటలు పండిస్తున్నాను. ఇంకా వరి, కొర్ర పంటలతోపాటు బొప్పాయి, పుచ్చ వంటి పండ్ల తోటలను కూడా సాగు చేస్తున్నాను. వీలైనంత వరకు పెట్టుబడి, ఖర్చులను తగ్గించుకుంటూ, నాణ్యమైన అధిక దిగుబడుల సాధనకు ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్నాను. టమాటా సాగులో ట్రెల్లీ విధానాన్ని పాటిస్తున్నాను. నీటి వినియోగాన్ని తగ్గించడానికి, కలుపు బెడద లేకుండా వుండడానికి బెడ్‌లు ఏర్పాటు చేసి మల్చింగ్ షీట్స్ వినియోగిస్తున్నాను.

వంగలో గ్రాఫ్టింగ్ విధానం.. రెండేళ్లపాటు కాపు

ఈ ఏడాది ప్రయోగాత్మకంగా అంటు కట్టే విధానంలో వంగ సాగు ప్రారంభించాను. ఆనందపురం మండలం తర్లువాడ వద్ద నర్సరీలో అంటు కట్టి మొక్కలు సరఫరా చేస్తున్నారు. మనం ఇచ్చిన విత్తనం నారు పోసి మొక్కలు ఎదిగిన తరువాత వారి వద్ద వుండే అడవి వంగకు అంటు కట్టి ఇస్తున్నారు. ఒక్కో వంగ మొక్కకు రూ.10 తీసుకుంటున్నారు. పొలంలో మొక్కల మధ్య నాలుగు అడుగులు, వరసల మధ్య ఆరు అడుగుల దూరం వుండేలా నాటాం. కాపు మొదలైనప్పటి నుంచి రెండేళ్లపాటు దిగుబడులు వస్తాయి.

మార్కెట్‌లో డిమాండ్.. మంచి ధర

సేంద్రీయ విధానంలో సాగు చేసిన పంటలకు డిమాండ్ ఉంది. విశాఖలోని గోపాలపట్నంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇతరచోట్ల కంటే ఇక్కడ కిలోకు రూ.2-3 ఎక్కువ ధర లభిస్తున్నది. సేంద్రీయ విధానంలో సాగు చేసే రైతులు పరిమితంగా వుండడంతో మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టు దిగుబడులు లేవు. గత ఏడాది 1.5 ఎకరాల్లో బొప్పాయి వేశాను. ఇంతవరకు అన్నీ కలిపి సుమారు రూ.2 లక్షలు ఖర్చుచేశాను. ఏడాదిలో సుమారు 15 టన్నుల దిగుబడి వచ్చింది. టన్ను సగటున రూ.30 వేల ధర లభించింది. ఖర్చులు పోను రూ.2.5 లక్షలు మిగిలాయి. వాతావరణం అనుకూలిస్తే మరో ఏడెనిమిది నెలలపాటు దిగుబడి వస్తుంది. మొదటి ఏడాదితో పోలిస్తే ఖర్చులు సగం కూడా వుండవు. మరో రెండు లక్షల రూపాయల వరకు మిగిలే అవకాశం వుంది.

వేసవిలో నీటి ఎద్దడి నివారణ

... 5వ పేజీ తరువాయి

ఆదేశించామన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు ఇంకా విడుదల కావల్సి ఉందన్నారు.

కాగా ఆర్థిక సంఘం నిధుల్లో ఇప్పటివరకు పంచాయతీలకు 70 శాతం, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు 15 శాతం చొప్పున వచ్చేవని, అయితే తాజాగా చేసిన మార్పుల చేసిన మేరకు మండల పరిషత్‌లకు 20 శాతం, జడ్పీలకు 10 శాతం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రహదారులు, ఇతర పనులకు రూ.20 కోట్లు, తాగునీటి పథకాలకు రూ.10 కోట్ల వ్యయానికి పాలనాపరమైన ఆమోదం తెలిపినట్టు సీఈవో పేర్కొన్నారు. సాధారణ నిధులు రూ.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వీటికి సంబంధించి ఇంతవరకు రూ.ఏడు కోట్ల విలువైన బిల్లులు సీఎంఎఫ్ఎస్‌కు అప్‌లోడ్ చేశామన్నారు.

అన్ని జడ్పీ హైస్కూళ్లకు ప్రహరీ గోడలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ సీఈవో నారాయణమూర్తి తెలిపారు. ప్రతి పాఠశాల చుట్టూ ప్రహరీగోడ వుండాలనే నిబంధన అమలుచేశామన్నారు. ఇప్పటి వరకు ప్రహరీగోడలు లేని పాఠశాలలకు సమగ్ర శిక్ష, ఉపాధిహామీ పథకం నిధులతో గోడలు నిర్మిస్తామని చెప్పారు. ప్రతి ఉన్నత పాఠశాల ఆస్తులకు సంబంధించి ఆయా మండల తహసీల్దార్ల నుంచి ఫెయిర్ అడంగల్ కాపీలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ పాఠశాలల ఆస్తుల విషయంలో ఆయా మండల పరిషత్ అధికారులకు ఇప్పటికే సూచనలు చేశామని సీఈవో వెల్లడించారు.

తాచేరుపై వంతెన నిర్మాణం ఎప్పుడో?

... 5వ పేజీ తరువాయి

నీరు పారుతున్నది. గత ఏడాది వర్షాకాలంలో వరద ధాటికి గ్రావెల్‌తోపాటు తూములు కూడా కొట్టుకుపోయాయి. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. అధికారులు కొత్తగా తూములువేసి, గ్రావెల్‌తో డైవర్షన్ రోడ్డును పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది జూన్ 17న ఎంపీ సీఎం రమేశ్, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఇక్కడకు వచ్చి పరిశీలించారు. కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కాగా వడ్డాది నుంచి చోడవరం మండలం వెంకన్నపాలెం జంక్షన్ వరకు కొత్త కల్వర్టులు నిర్మించాల్సి వుందని, వీటితోపాటు తాచేరు నదిపై కొత్తవంతెన నిర్మాణానికి రూ.5 కోట్లతో ప్రతిపాదలు తయారు చేసి పంపామని ఆర్‌అండ్‌బీ చోడవరం ఏఈ సత్యప్రసాద్ తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.


నర్సీపట్నంలో 75 కిలోల కేక్ కట్ చేస్తున్న కౌన్సిలర్ రాజేశ్


చోడవరంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు


కె.కోటపాడులో ఎమ్మెల్యే బండారుకు కేక్ తినిపిస్తున్న పీవీజీ కుమార్

అట్టహాసంగా సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఎక్కడికక్కడ కేక్‌లు కట్ చేసి పార్టీ శ్రేణుల సంబరాలు

నిరుపేదలు, వృద్ధులు, రోగులకు సేవా కార్యక్రమాలు

నర్సీపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అలాగే నిరుపేదలు, వృద్ధులు, ఆస్పత్రుల్లో రోగులకు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

నర్సీపట్నంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సీఎం చంద్రబాబు 75వ జన్మదినం సందర్భంగా 75 కిలోల కేక్‌ను మునిసిపల్ కౌన్సిలర్ రాజేశ్ కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీ4 మోడల్ ద్వారా 2047 ఏడాదికి గ్రామాల్లో అన్ని పేద కుటుంబాలను సీఎం చంద్రబాబు బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. అలాగే చంద్రబాబునిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో ఇటువంటి పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం 24వ వార్డు కౌన్సిలర్ పిల్లి మహేశ్వరరావు సీఎం సహాయ నిధికి రూ.1.18 లక్షల చెక్కును రాజేశ్‌కు అందించారు. భారీగా అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చోడవరంలో...

చోడవరం: టీడీపీ అధినేత సీఎం చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా గ్రామాల్లో నాయకులు కేక్‌లు కట్ చేశారు. అలాగే పేదలకు వస్త్రాల పంపిణీ చేశారు. ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే రాజు సమక్షంలో నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, సబ్‌జైలులో ఖైదీలకు పాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, నాయకులు మల్లునాయుడు, పెదబాబు, మత్స్యరాజు, దేవరపల్లి వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, ఈర్లె శ్రీనివాస్, గూనూరు సురేశ్, ఎలకా మల్లిబాబు, పాలెం నాయుడు, సాలాపు నరసింహమూర్తి పాల్గొన్నారు.

రావికమతంలో...


రావికమతంలో రోగులకు పండ్లు పంచుతున్న టీడీపీ నాయకులు

రావికమతం: మండలంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తకోటలో టీడీపీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి, గ్రామ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. టి.అర్జాపురం, చిలకవానిపాలెం గ్రామాల్లో మత్స శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు గుటాల చిన్న, సర్పంచ్ మడగల ఫాల్గుణ కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. సంతబయలు వద్ద దేవాలయంలో ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు ఆధ్వర్యంలో చంద్రబాబు పేరున ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు గంజి సూర్యనారాయణ, ఉప్పులూరి నాగేశ్వరావు, వేపాడ నాగేశ్వరావు, అప్పలనాయుడు, పులగాయల సత్యనారాయణ, గంజి రాజేశ్వరావు, చుక్కల రాము, కోమటి శంకరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలోని తామరం గ్రామంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మరిన్ని పట్టిన రోజులు చేసుకోవాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లోనూ పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, చినబాబు, జోగిపాత్రుడు, దుంగల రమణ, కేతిరెడ్డి చిరంజీవి, లాలం రాము, యర్రంశెట్టి రమణ, సురేశ్, ప్రభాకర్ రాజు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. భవిష్యత్తు తరాల కోసం ఆలోచించే చంద్రబాబు ముఖ్యమంత్రి


నాతవరంలో చంద్రబాబు జన్మదిన వేడుకల కేక్ కట్ చేస్తున్న నాయకులు

కావడం ప్రజల అదృష్టమని ఈ సందర్భంగా సత్యనారాయణ, వెంకటరమణ పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు సత్యవతి, మాజీ ఎంపీపీ ఎస్.సన్యాసిదేముడు, నాయకులు పి.దాసు, అపిరెడ్డి మాణిక్యం, పారుపల్లి వెంకటరమణ, బంగారు సూరిబాబు, అంకంరెడ్డి యర్రాపాత్రుడు, జీరెడ్డి రాజుబాబు, ఇటంశెట్టి ప్రభవతి, కె.అప్పలనాయుడు, కాశపు నూకరాజు, సిహెచ్.ప్రశాంత్ పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ: మండలంలోని సీఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, జోగంపేట, కొత్తమల్లంపేట, పాకలపాడు, ఏటిగైరంపేట, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం గ్రామాల్లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అలాగే గొలుగొండ పీహెచ్‌సీలో తెలుగుయువత నేత రాయపురెడ్డి మౌళి ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామిరెడ్డి గోవింద్, కొల్లి రాంబాబు, పుల్లేటి కుర్తి రమేశ్, కె. రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం తదితర గ్రామాల్లో సీఎం నారా చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రామకృష్ణ, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, నాయకులు బొడ్డు జమీలు, గొంప వాసు, చిట్టిబాబు, బొటిశెట్టి పాపారావు, లగుడు రమేశ్, రాజులునాయుడు, స్వామినాయుడు, ముప్పల వరహాలబాబు, కొలగాని రామారావు, బొప్పన ప్రసాద్, యర్రంశెట్టి అప్పన్నబాబు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: వడ్డాదిలోని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వడ్డాది అధ్యక్షుడు దొండా నరేశ్ ఆధ్వర్యంలో శివాలయంలో చంద్రబాబు పేరిట పూజలు చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు, ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, సింగంపల్లి రమేశ్, ఇంటి


దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో పీవీజీకి కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే బండారు

అప్పారావు, ఎస్.మాధవరావు, మంచాల గోవింద, తలారి శంకర్, కోవెల వెంకటరమణ, ఎస్.శేషు, పేరమ్మ, గురుమూర్తి, సూరిబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో సీఎం చంద్రబాబు పుట్టిన రోజు కేక్‌ను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కేకు కట్ చేశారు. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ.కుమార్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు, పార్టీ మండల కార్యదర్శి చెరకాన సూర్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే రైవాడ అతిథి గృహం ఆవరణలో పార్టీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, నాయకులు కడిం నాగేశ్వరరావు, బండారు రామారావు, కొప్పాక కాసుబాబు పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల: అభివృద్ధిలో రాజీపడని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు రంజిత్‌వర్మ ఆధ్వర్యంలో చంద్రబాబు పేరున ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సెయింటన్స్ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి వారికి భరోసా కల్పించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. కార్యక్రమంలో నాయకులు లెక్కల కాశిబాబు, సూర్యనారాయణరాజు, మరువాడ ఈశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ: అప్పరాజుపురంలో సీఎం చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దేశానికి సేవ చేసేందుకు చంద్రబాబునాయుడు ఎంతో అవసరమని కొనియాడారు. చీడికాడలో టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, తురువోలులో ఎంపీటీసీ బీళ్ల కోటేశ్వరరావు, రెడ్డి సన్యాసినాయుడు, జైతవరంలో ఎంపీటీసీ పైల ముత్యాలనాయుడు, దిబ్బపాలెంలో ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు గవిరెడ్డి జగన్నాథం, గవిరెడ్డి శ్రీనివాసరావు, కురచా సురేశ్, కురచా కన్నంనాయుడు, డోకల రామలింగస్వామి, గండి ముసలినాయుడు, యర్రా అప్పారావు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండల కేంద్రంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సీఎం చంద్రబాబు పుట్టిన రోజు కేక్ కట్ చేసి చేశారు. చంద్రబాబు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉంటూ రాష్ట్ర ప్రజలను పాలించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం 50 పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. అలాగే చౌడువాడ, ఎ.కోడూరు, కింతాడ గ్రామాల్లో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కొప్పుల వెలమ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ.కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు బి.వెంకటరమణ, డి.నరసింహమూర్తి, జె.రాము, ఎస్.రామునాయుడు, ఎరుకునాయుడు, బి.నరసింహనాయుడు, కె.సూర్యనారాయణ, పి.నారాయణమూర్తి, బి.అక్కునాయుడు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

నర్సీపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆవరణలో అగ్నిమాపక అధికారి అప్పలస్వామి ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఉపయోగించే పరికరాలను ప్రదర్శించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మునిసిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థల్లో పేదలకు 25 శాతం సీట్లు

చోడవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ప్రభుత్వం ఉచితంగా కేటాయించిందని, ఇందులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో జి.సింహాచలం తెలిపారు. ఐబీ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్సీలకు పది శాతం, ఎస్టీలకు నాలుగు శాతం, బీసీ మైనారిటీలకు ఆరు, అనాథలు హెచ్ఐవీ, దివ్యాంగులకు ఐదు శాతం కోటా కేటాయించారన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఆదాయ పరిమితి రూ.1.2 లక్షల లోపు ఉండాలని స్పష్టం చేశారు. ఈనెల 26లోగా దరఖాస్తులకు గడువు ఉందని ఆయన తెలిపారు.

24న మండల సర్వసభ్య సమావేశం

చీడికాడ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో హేమసుందర్రావు ఆదివారం తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన సూచించారు.

ఇంటర్ ఫలితాల్లో కళాశాల టాపర్‌కు సత్కారం


ఇంటర్ టాపర్ లోవశంకర్‌ను సత్కరిస్తున్న వేణుగోపాల్, నాయకులు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్ గొంప లోవశంకర్‌ను జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ లోవశంకర్ ఎంపీసీలో 929 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలవడం తల్లిదండ్రులకు, కళాశాలకు గర్వకారణమన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్యనందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రామకృష్ణ, టీడీపీ నాయకులు గొంప వాసు, చిట్టిబాబు, బొడ్డు జమీలు, రాజులునాయుడు, రమేశ్ పాల్గొన్నారు,

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొండలరావు


కొండలరావు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా శానాపతి కొండలరావు నియమితులయ్యారు. మండలంలోని ఎం.కోటపాడుకు చెందిన కొండలరావు ఆరు నెలల క్రితం వరకు ఏఎంసీ ఛైర్మన్‌గా సేవలు అందించారు. అంతకు ముందు పదేళ్ల పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా, ముప్పై ఏళ్ల పాటు విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన్ను వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

▸▸ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాజు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో జనసేనను బలోపేతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు సూచించారు. మండలంలో పెదమదిన గ్రామంలో ఆదివారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది తరువాత జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ఇప్పటి నుంచే సైనికుల్లా పనిచేయాలని సూచించారు. వైసీపీ నుంచి మరింత మంది జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవ చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అడపా నరసింహమూర్తి, దాడి సూర్యనాగేశ్వరరావు, అల్లం రామఅప్పారావు, కొలిమల్ల వెంకటరావు, రమాదేవి, సిరిపురపు రమేశ్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో వేసవి క్రీడా శిబిరం

నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం వేసవి క్రీడా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరం 40 రోజుల పాటు కొనసాగుతుందని బోర్డు డైరెక్టర్లు వెలగా నారాయణరావు, బోళెం శివ, జగన్నాథం తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు శేఖర్, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ సమాజంలో సోలార్ ప్లాంట్ ప్రారంభం


సోలార్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రేమ సమాజంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదివారం ప్రారంభించారు. అలాగే డాక్టర్ పి.రాజేశ్ దంపతుల సహకారంతో సోలార్‌ప్లాంట్, ప్రేమ సమాజం ఛైర్మన్ బుద్ధ శివాజీ సహకారంతో ఏర్పాటైన ఆర్వో ప్లాంట్, నూతన భవనాలు, అందులో మంచాలు, యువకులకు ఉపయోగపడేలా గ్రంథాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పూసర్ల రామారావు, ప్రేమ సమాజం రథసారథులు ప్రసాదరాజు, పూసర్ల రామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, ఫోరం ఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు డీఎస్ ప్రసాద్, ఏడమ్సి వెంకటరావు, పుట్టా గంగయ్య, సాకా రమేశ్, దేముడు మాస్టారు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మాడుగుల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకవజాము ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు, అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన కొందరు భక్తులు భారీ ఎత్తున అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎండీ నిర్వాకంతోనే గోవాడ ఫ్యాక్టరీకి నష్టాలు

దిద్దుబాటు చర్యలు చేపట్టాలని

ఎమ్మెల్యేకు గుర్తింపు కార్మిక సంఘం నాయకుల వినతి


ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

చోడవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో గోవాడ ఫ్యాక్టరీ నష్టాల పాలైందని, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టి ఫ్యాక్టరీని గాడిలో పెట్టే చర్యలు తీసుకోవాలని గోవాడ షుగర్స్ గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం నేత భాస్కరరావు ఆధ్వర్యంలో కార్మికులు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు శనివారం రాత్రి వినతిపత్రం అందజేశారు. ఈ సీజన్‌లో ఫ్యాక్టరీ అధ్వానంగా నడవడానికి ఎండీ తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలే కారణమని పేర్కొన్నారు. ఫ్యాక్టరీలో టర్బయిన్, బాయిలర్ వంటి కీలక యంత్రాలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సీజన్‌లో అంతరాయాలకు కారణమయ్యాయయన్నారు. కార్మికులను రీకాల్ చేయకుండా డబ్బులు ఆదా చేశానని చెపుతూ ఎండీ తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్ల ఫ్యాక్టరీ తీవ్రంగా నష్టపోయిందని, ఓవరాలింగ్ పనులను ఎండీ తేలిగ్గా తీసుకోవడం వల్లే ఈ అనర్థాలకు దారితీసిందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణరాజు, శ్యామ్, అప్పలరాజు, హరిహరరావు, వేపాడ శ్రీను, రాపేటి జగన్నాథరావు, వసాది రమణ, అల్లం రామప్పారావు, రాజు, భాస్కర్, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి కోసం గిరిజనుల నిరసన

రావికమతం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రామన్నదొరపాలెం, పి.కొట్నాబిల్లి గ్రామాల్లో గిరిజనులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ ఉపాధి పనుల నిర్వహణలో రాష్ట్రంలోనే అనకాపల్లి ప్రథమ స్థానంలో ఉందని ప్రకటించిన అధికారులు, పనులు చేసిన కూలీలకు 13 వారాలైనా వేతనాలు చెల్లించకపోవడం దారుణమని వాపోయారు. ఓపక్క విపరీతంగా పెరిగిపోతున్న నిత్యావసర సరకుల ధరలతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు, ఉపాధి పనులకు కూలి చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా వేతన బకాయి చెల్లించాలని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాడి బెన్నయ్య, తుబే లక్ష్మి పాల్గొన్నారు.


కంచాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పండగ


ఈస్టర్‌కు హాజరైన క్రిస్టియన్లు... (ఇన్‌సెట్‌లో) ఏసుప్రభు కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పండగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్సీఎం చర్చి ఆవరణలో పాస్టర్ శౌరిబాబు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ముందుగా పాస్కో కొవ్వొత్తిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రార్థనా గీతాలతో చర్చి ఆవరణ మారుమార్మోగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏసుప్రభు ఉత్థాన సన్నివేశంఆకట్టుకుంది. కార్యక్రమంలో డాన్‌బోస్కో రెక్టర్ పాస్టర్ బెన్ని పాల్గొన్నారు.

చోడవరంలో...

చోడవరం: ఈస్టర్ పండగను క్రైస్తవులు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. రోమన్ సైనికుల చేతిలో చిత్రహింసలు అనుభవించి మరణించిన మూడో రోజున ఆయన ప్రకటించినట్టుగానే పునరుత్థానుడై సమాధి నుంచి లేచిన సందర్భంగా క్రైస్తవులు ఏటా ఈస్టర్ పండగను ఆనందంగా జరుపుకోవడం ఆనవాయితీ. క్రీస్తు పునరుత్థానాన్ని స్వాగతిస్తూ స్థానికంగా చర్చిలలో శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారు వరకు ప్రార్థనలు చేశారు. 40 రోజుల పాటు దీక్ష పాటించిన క్రైస్తవులు ఆదివారంతో ముగించారు.